

సత్తుపల్లికి గరిష్ట ఫలాలు

సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు సత్తుపల్లి నియోజకవర్గంలోని 81వేలకు పైగా ఎకరాల భూమికి అందనున్నాయి.

10లో



వరంగల్ పాలు.. ఖమ్మంలో..

వరంగల్ యూనిట్‌కు చెందిన విజయ డెయిరీ పాలను ఖమ్మంలో తక్కువ ధరతో విక్రయిస్తున్నట్లు గుర్తించారు.

10లో

గరిష్టం / కనిష్టం 33° / 25°

వాతావరణం

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం తర్వాత ఆకాశం మేఘావృతమై చల్లబడే అవకాశముంది.

న్యూస్‌రీల్

నానో యూరియాతో తగ్గనున్న వ్యయం



నానో యూరియా పిచికారీని పరిశీలిస్తున్న డీఏఓ, తదితరులు

కొణిజర్ల: సంప్రదాయ గుళికల యూరియా వాడకంతో పోలిస్తే నానో యూరియా వినియోగం ద్వారా రైతులకు ఖర్చు తగ్గుతుందని ఖర్చు తగ్గడమే కాక పర్యావరణ పరిరక్షణకు పాటుపడినట్లవుతుందని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. కొణిజర్ల మండలం తుమ్మలపల్లిలో నానో యూరియా వాడకంపై మంగళవారం రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ నానో యూరియా పిచికారీ వల్ల నేరుగా ఆకులపై పడి మొక్కకు పోషకాలు చేరతాయని తెలిపారు. తద్వారా దిగుబడి 8 – 10 శాతం పెరుగుతుందని, గాలిలో ఆవిరయ్యే అవకాశం ఉండదని చెప్పారు. ఈకార్యక్రమంలో ఏఓ బాలాజీ, ఏఈఓ కుమార్‌రాజా పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు మరో అవకాశం

ఖమ్మంమయూరిసెంటర్: 2024–25 విద్యాసంవత్సరం ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 9, 10వ తరగతులు చదివిన బీసీ విద్యార్థుల నుండి ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ అధికారి జి.జ్యోతి తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకోలేని విద్యార్థులు ఇప్పుడు తెలంగాణ ఈ–పాస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డ్, జాయింట్ బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్ జిరాక్స్ పత్రాలు జతపర్చి దరఖాస్తు చేసుకున్నాక ఆయా పత్రాలను తమ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

లాభాల పంట.. ఆయిల్‌పామ్



ప్లాంటేషన్‌ను ప్రారంభిస్తున్న మధుసూదన్, ఉద్యోగులు

తల్లాడ: రైతులు ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు గడించొచ్చని జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఎం.వీ.మధుసూదన్ తెలిపారు. తల్లాడ మండలం తెలగారంలో మంగళవారం పలువురు రైతులు ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతుండగా మధుసూదన్ పరిశీలించి మాట్లాడారు. ఆయిల్‌పామ్ ఒకసారి నాటితే 30ఏళ్ల వరకు ఆదాయం వస్తుందని, ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడల బెడద ఉందని తెలిపారు. అంతేకాక ప్రభుత్వం రాయితీపై మొక్కలు ఇస్తూనే నిర్వహణ ఖర్చులు కూడా చెల్లిస్తున్నందున రైతులు ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఉద్యాన అధికారి నగేష్, ఏఓ ఎం.డీ.తాజుద్దీన్, ఆయిల్‌ఫెడ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో నియామకాలకు తుది జాబితా

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని వివిధ కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న సీఆర్‌టీ, పీజీ సీఆర్‌టీ పోస్టులకు సంబంధించి ఆరుగురు అభ్యర్థులను ఎంపిక చేసినట్లు డీఈఓ సామినేని సత్యనారాయణ తెలిపారు. ఈమేరకు తుది జాబితాను డీఈఓ కార్యాలయంలో ప్రదర్శించామని వెల్లడించారు. ఇందులో పేర్లపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 17వ తేదీ సాయంత్రం 5గంటలలోగా తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

నాగులవంచ సొసైటీకి అవార్డు



అవార్డు అందుకుంటున్న చైర్మన్, సీఈఓ

చింతకాని: రైతులకు ఉత్తమ సేవలందించినందుకు గాను మండలంలోని నాగులవంచ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి అవార్డు లభించింది. రైతులకు రుణాల పంపిణీ, ఇతర అంశాల్లో మెరుగైన పనితీరుతో అవార్డు ప్రకటించారు. ఈమేరకు హైదరాబాద్‌లోని నాబార్డు కార్యాలయంలో మంగళవారం సమావేశంలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా సొసైటీ చైర్మన్ నల్లమోతు శేషగిరిరావు, సీఈఓ యాలమూడి శ్రీనివాసరావు అవార్డు అందుకున్నారు.

సంక్షేమ గురుకులాలు.. హౌస్‌ఫుల్!



చుంచుపల్లి బీసీ బాలుర గురుకుల పాఠశాలలో ప్రార్థనలో పాల్గొన్న విద్యార్థులు



రఘునాథపాలెం బీసీ గురుకుల కళాశాల తరగతి గదిలో విద్యార్థినులు

ప్రవేశాలకు విద్యార్థులు, తల్లిదండ్రుల ఆసక్తి

- ఎస్సీ, బీసీ గురుకులాల్లో 90శాతానికి పైగా సీట్లు భర్తీ
- మిగిలిన సీట్ల కోసం పోటాపోటీగా పైరవీలు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సంక్షేమ గురుకులాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు గురి కుదురుతోంది. ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖల గురుకులాల్లో ప్రవేశాలకు ఏటా పోటీ పెరుగుతుండడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. గతంలో సీట్లకు సరిపడా విద్యార్థులు మాత్రమే ప్రవేశపరీక్ష రాయడంతో దాదాపు అందరికీ సీట్లు వచ్చేవి. కానీ రెండు, మూడేళ్లుగా పరీక్ష రాస్తున్న విద్యార్థుల సంఖ్య పెరగడంతో పోటీ పెరిగింది. ఒక్కో గురుకులంలో వందల సంఖ్యలో ఉన్న సీట్లకు వేల సంఖ్యలో విద్యార్థులు పోటీ పడుతుండడం విశేషం. ఉమ్మడి జిల్లాలో ఎస్సీ, బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యాన గురుకులాలు కొనసాగుతుండగా, ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖల గురుకులాల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రధానంగా బీసీ గురుకులాల్లో గత ఏడాది 2వేల మేర సీట్లు ఖాళీగా మిగిలితే ఈసారి సీట్లన్నీ భర్తీ అవుతుండడంపై అధికారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

పెరుగుతున్న ఆదరణ

సంక్షేమ శాఖల పరిధిలోని గురుకులాల్లో చేరేందుకు గతంలో విద్యార్థులు అంతగా ఆసక్తి చూపించలేదు. అయితే, నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారం అందిస్తుండడంతో ఏటేటా పోటీ పెరుగుతోంది. గురుకులాల్లో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు కార్పొరేట్ స్థాయి బోధన అందుతోంది. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, లెక్చరర్లు బోధిస్తుండగా, చదువుతోనే సరిపెట్టకుండా విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడంపైనా దృష్టి సారిస్తున్నారు. క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తుండడంతో విద్యార్థులు పలువురు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్నారు. వసతి విషయానికి వస్తే బెడ్ల నుంచి ఆహారం వరకు నాణ్యతగా ఉండం.. సన్నబియ్యంతో భోజనమే కాక మటన్, చికెన్, గుడ్లు, పాలు అందిస్తున్నారు. బాలికలు, బాలురకు వేర్వేరుగా విద్యనందించేలా ఏర్పాట్లు ఉండడంతో విద్యార్థినుల నుంచి కూడా ఆదరణ పెరుగుతోంది.

◆ సీట్ల కోసం పైరవీలు..

గురుకులాల్లో చేరేందుకు వేల మంది ప్రవేశ పరీక్ష రాస్తున్నారు. అయితే, కొందరికి సీట్లు రాకపోగా, సీట్లు వచ్చినా పలువురు వివిధ కారణాలతో చేరడం లేదు. దీంతో బ్యాక్‌లాగ్ సీట్లలో చేరేందుకు విద్యార్థులు ప్రయత్నిస్తున్నారు. ఈక్రమంలోనే ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల ద్వారా పిల్లలకు సీట్లు ఇప్పించాలని తల్లిదండ్రులు సంక్షేమ శాఖల అధికారులకు చెప్పిస్తున్నారు. ఇంకొందరు ఓ అడుగు ముందుకేసి లేఖలతో కార్యాలయాల చుట్టూ తిరుగుతుండడం గురుకులాలపై పెరిగిన ఆదరణకు నిదర్శనంగా నిలుస్తోంది.

మెరుగైన ఉత్తీర్ణత



మునుపెన్నడూ లేనివిధంగా ఈ విద్యాసంవత్సరం బీసీ గురుకులాల్లో చేరేందుకు విద్యార్థుల్లో ఆసక్తి పెరిగింది. గత ఏడాది పదో తరగతి, ఇంటర్‌లో మెరుగైన ఉత్తీర్ణత నమోదు కావడమే కాక పలువురు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. గురుకులాల్లో మెరుగైన విద్యతో పాటు మంచి సౌకర్యాలు ఉండడం విద్యార్థుల సంఖ్య పెరగడానికి కారణంగా భావిస్తున్నాం. – సీహెచ్.రాంబాబు, ఆర్‌సీఓ, బీసీ గురుకులాలు

ఉమ్మడి జిల్లాలో బీసీ, ఎస్సీ గురుకులాలు, సీట్ల వివరాలు

	బీసీ గురుకులాలు				ఎస్సీ గురుకులాలు			
జిల్లా	పాఠశాలలు	కళాశాలలు	మొత్తం సీట్లు	నిండినవి	పాఠశాలలు	కళాశాలలు	మొత్తం సీట్లు	నిండినవి
ఖమ్మం	13	13	8,674	8,370	11	11	7,040	6,564
భద్రాద్రి	11	10	6,880	6,450	07	07	4,480	4,190

పారిశుద్ధ్య నిర్వహణ, పచ్చదనంపై దృష్టి

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- వన మహోత్సవానికి ఏర్పాట్లు చేయాలని సూచన





అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ (ఇన్‌సెట్) క్యాంటీన్‌లో టీ తాగి నగదు చెల్లిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం సహకారనగర్: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపర్చడమే కాక మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన స్థానిక సంస్థల పనితీరుపై అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వన మహోత్సవం ద్వారా అవెన్యూ, బ్లాక్ ప్లాంటేషన్‌పై శ్రద్ధ కనబర్చాలని, ఇదే సమాయన రహదారుల వెంట పిచ్చి మొక్కలు తొలగించాలని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో కూడా రెండెకరాల చొప్పున అర్బన్ పార్క్ ఏర్పాటుకు స్థలాలను గుర్తించి మొక్కలు నాటాలన్నారు. అలాగే, సీజనల్ వ్యాధుల నియంత్రణకు పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపర్చాలని కలెక్టర్ సూచించారు. ఆతర్వాత ఆస్తి పన్నుల వసూళ్లు, ఇందిరా మహిళా డెయిరీ ఏర్పాటుపై సూచనలుచేశారు. జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్డీఓ సన్యాసయ్య, డీపీఓ ఆశాలత, డీఎంహెచ్ఓ కళావతిబాయి, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

కలెక్టరేట్‌లో అధికారులు, ఉద్యోగులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. కలెక్టరేట్ ఆవరణలోని వివిధ విభాగాలను పరిశీలించిన ఆయన హాజరుపై ఆరా తీశారు. ప్రతీ శాఖలోని ఉద్యోగుల హాజరు బయో మెట్రిక్ ద్వారా నమోదు చేయాలని తెలిపారు. అనంతరం క్యాంటీన్‌ను పరిశీలించిన కలెక్టర్ టీ తాగి డబ్బు చెల్లించారు. డీఆర్ఓ ఏ.పద్మశ్రీ, ఏఓ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోటలకు డ్రిప్

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో ఆయిల్ పామ్ తోటలకు యుద్ధప్రాతిపదికన డ్రిప్ సౌకర్యం కల్పించాలని కలెక్టర్ అనుదీప్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఉద్యాన, వ్యవసాయ, విద్యుత్ శాఖల అధికారులతో సమావేశమైన ఆయన ఆగస్టు 15నాటికి జిల్లా లక్ష్యం మేర ఆయిల్ పామ్ మొక్కలు నాటడమే కాక డ్రిప్ సౌకర్యం కల్పించాలన్నారు. జిల్లా ఉద్యాన, వ్యవసాయ శాఖాధికారులు ఎం.వీ.మధుసూదన్, డి.పుల్లయ్య, విద్యుత్ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

మున్నేటిపై చెక్‌డ్యామ్‌ల తొలగింపు

ప్రజల భద్రత, వరద నివారణ కోసం నిర్ణయం



ప్రకాష్‌నగర్ వద్ద చెక్‌డ్యామ్

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగరాన్ని మున్నేటి వరద ముప్పు నుంచి రక్షించేలా రెండు చెక్‌డ్యామ్‌లను తొలగించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. మున్నేటిపై ప్రకాశ్‌నగర్, రంగనాయకుల గుట్ట వద్ద చెక్‌డ్యామ్‌లు ఉండగా, వరద పోటెత్తినప్పుడు నీరు నిలిచి సమీప ప్రాంతాలను ముంచెత్తుతోందని అధికారులు నివేదిక సమర్పించారు. ఈ నేపథ్యాన ప్రజల ప్రాణాలు, ఆస్తులతో పాటు నగరాన్ని వరద ముంపు నుంచి రక్షించేలా చెక్‌డ్యామ్‌లను తొలగించాలని కలెక్టర్ మంగళవారం ఆదేశించారు. రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖలతో సమన్వయం చేసుకుంటూ తగిన భద్రతా చర్యలు పాటిస్తూ వీటిని తొలగించాలని పేర్కొన్నారు. కలెక్టర్ సూచనలతో రంగనాయకుల గుట్ట వద్ద చెక్‌డ్యామ్‌ను పూర్తిగా తొలగించనుండగా, ప్రకాష్‌నగర్ చెక్ డ్యామ్‌ను ఒక మీటర్ మేర తొలగించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

పెద్దాస్పత్రిలో కార్డియాలజిస్ట్ నియామకం

యథావిధిగా గుండె సంబంధిత చికిత్సలు



పెద్దాస్పత్రిలోని కార్డియాలజీ విభాగం

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో గుండె సంబంధిత చికిత్సలు యథావిధిగా కొనసాగుతున్నాయి. ఆస్పత్రిలో కార్డియాలజిస్ట్‌గా డాక్టర్ సీతారాం డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తించారు. అయితే, గత నెలలో ఆయన డిప్యూటేషన్ గడువు ముగియడంతో చికిత్సలు నిలిచిపోయాయి. ఆస్పత్రిలో రూ.కోట్ల వ్యయంతో క్యాథ్ ల్యాబ్ ఏర్పాటుచేయగా ఖమ్మం జిల్లాతో పాటు భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల నుంచి గుండె సంబంధిత సమస్యలతో వచ్చే వారికి చికిత్స అందేది. డాక్టర్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురుకాగా ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి. ఈ విషయాన్ని ఆస్పత్రి అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో డాక్టర్ సీతారాంనే తిరిగి డిప్యూటేషన్‌పై తీసుకోవాలని నిర్ణయించారు. దీంతో ఆయన విధుల్లో చేరగా 2డీ ఎకో, యాంజియోగ్రాం, స్టంట్లు, పేస్‌మేకర్ తదితర వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి.

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని అభయ ఆంజనేయస్వామి వారికి అర్చకులు అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

వైరా రిజర్వాయర్ నుంచి సాగునీటి విడుదల



రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్



రాయమాధారం వద్ద సాగర్ కాల్వలోకి చేరుతున్న గోదావరి జలాలు

వైరా: వైరా రిజర్వాయర్ ఆయకట్టుకు కుడి, ఎడమ కాల్వల ద్వారా సాగునీటిని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నీటి విడుదలతో 22 వేల ఎకరాల్లో పంటల సాగుకు ఇబ్బందులు ఉండవని చెప్పారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీపీసీసీ కార్యదర్శులు నూతి సత్యనారాయణ, కట్ల రంగారావు, నాయకులు బొర్రా రాజశేఖర్, శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డె నారాయణరావు, దాసరి దానియేలు, దొడ్డా పుల్లయ్య, పాదిల హరినాథ్, ఏదునూరి సీతారాములు, బోళ్ల గంగారావు, సౌజన్య, వీరభద్రం, శేఖర్ గౌడ్, బొందయ్య, సాయి, రత్నం పాల్గొన్నారు.

అటు మూసి.. ఇటు వదిలి...

ఏన్కూరు: సీతారామ ప్రాజెక్టు నుంచి వచ్చే గోదావరి జలాలు వైరా రిజర్వాయర్‌కు చేరేలా ఏన్కూరులో లింక్ కెనాల్ నిర్మించారు. తద్వారా సాగర్ నుంచి కృష్ణా జలాల విడుదలలో జాప్యం జరిగినా గోదావరి జలాలతో పంటల సాగు సాఫీగా జరుగుతుందని భావించారు. ఈమేరకు రిజర్వాయర్ ఆయకట్టు రైతుల కలలు నెరవేరే సమయం ఆసన్నమైంది. మూడు రోజుల క్రితం అశ్వాపురం మండలం బీ.జీ.కొత్తూరు పంప్‌హౌస్ నుంచి గోదావరి జలాలను విడుదల చేయగా ములకలపల్లి మండలం మీదుగా లింక్ కెనాల్ ద్వారా సాగర్ కాల్వలోకి చేరాయి. అక్కడి నుంచి సత్తుపల్లి నియోజకవర్గానికి నీరు ప్రవహిస్తున్న నేపథ్యాన వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మంగళవారం 52 కి.మీ. వద్ద షట్టర్లు మూసివేసి రాయమాధారం వద్ద షట్టర్ ఎత్తి వైరా రిజర్వాయర్‌కు విడుదల చేశారు. కాగా, ఏన్కూరు నుంచి రాయమాధారం 38 కి.మీ. షట్టర్ వరకు సుమారు 14 కి.మీ. ప్రవహించిన గోదావరి జలాలు అక్కడి నుండి నిమ్మవాగు ద్వారా 22 కి.మీ. ప్రవాహం అనంతరం వైరా రిజర్వాయర్‌లోకి చేరనున్నాయి. అయితే, సత్తుపల్లి నియోజకవర్గానికి నీటి విడుదల ఆ తర్వాత ఉంటుందా, ఉండదా అన్న అంశంపై సందిగ్ధత నెలకొంది.

అండర్–19 క్రీడాపోటీలపై నీలినీడలు



పరుగు పందెం పోటీలో విద్యార్థులు (ఫైల్)

- ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నియామకంపై అస్పష్టత
- జిల్లాలో రెగ్యులర్ పీడీలు లేక జాప్యం

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఏటా నిర్వహించే అండర్–19 స్థాయి క్రీడాపోటీల నిర్వహణపై ఈసారి స్పష్టత రావడం లేదు. ఏటా జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయికి, ఆతర్వాత జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. అయితే, ఇప్పటికే జాతీయ స్థాయి పోటీల క్యాలెండర్ విడుదలైనా జిల్లాలో పోటీలు ఎప్పుడు నిర్వహిస్తారో ఎవరూ చెప్పలేకపోతున్నారు. అయితే, పోటీల నిర్వహణలో కీలకమైన ఎస్‌జీఎఫ్ కార్యదర్శిగా ఎవరిని నియమించాలో తెలియక ఇంటర్ విద్యాశాఖ అధికారులు సందిగ్ధంలో పడినట్లు సమాచారం.

ఒకే ఒక్క పీడీ

పాఠశాలల స్థాయిలో సత్తా చాటిన క్రీడాకారులు ఇంటర్ విద్య కోసం జూనియర్ కళాశాలల్లో చేరాక ఆ స్థాయిలో సహకారం అందడంలేదనే విమర్శలు ఉన్నాయి. దాదాపు ఆరేళ్లుగా జిల్లాలో ఇదే పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లాలని సూచించడం తప్ప శిక్షణ ఇవ్వడం, వెంట వెళ్లడం సాధ్యపడడం లేదు. కొన్నేళ్ల క్రితం వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్లు ఉండడంతో విద్యార్థులకు ప్రోత్సాహం, శిక్షణే కాక అండర్–19 క్రీడా పోటీల నిర్వహణ ఉత్సాహంగా సాగేది. కానీ పీడీలు ఒక్కరొక్కరుగా రిటైర్డ్ అవుతుండగా ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ కాలేజీల్లో ఒకే ఒక్కరు మిగిలారు. ఖమ్మంలోని నయాబజార్ కాలేజీలో సదరు పీడీ విధులు నిర్వర్తిస్తుండగా ఆ పీడీ కూడా కార్యదర్శిగా విధులు నిర్వర్తించేందుకు సుముఖంగా లేరని సమాచారం. ఆతర్వాత పీడీల కొరతతో కేజీబీవీ ఫిజికల్ డైరెక్టర్‌ను నియమించారు. ఈసారి వీరిద్దరు ఆసక్తిగా లేకపోవడంతో కార్యదర్శిగా ఎవరిని నియమించాలో తెలియక జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో క్రీడలపై ఆసక్తి కలిగిన సీనియర్ అధ్యాపకులు లేదా ప్రభుత్వ గురుకులాల్లోని సీనియర్ పీడీని నియమించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

పీడీల నియామకం ఎప్పుడో?

రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కళాశాలల్లో కొన్నేళ్లుగా పీడీల నియామకం జరగడం లేదు. రెగ్యులర్ పీడీలను నియమించకున్నా ఇతర సబ్జెక్టుల మాదిరి కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానంలో తీసుకుంటే విద్యార్థులకు శిక్షణ అందుతుందని చెబుతున్నారు. బీపీఈడీ, ఎంపీఈడీ పూర్తిచేసి ప్రైవేట్ కళాశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న సీనియర్లకు అవకాశం కల్పిస్తే మంచిదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అటు పీడీలు లేక, ఇటు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నియామకంపై స్పష్టత రాక ప్రతిభ ఉన్న విద్యార్థులు క్రీడల్లో రాణించే అవకాశాలు కోల్పోతున్నందున అధికారులు స్పందించాలని క్రీడాసంఘాల బాధ్యులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఎంపీ సిఫారసుతో నలుగురికి సీఎంఆర్ఎఫ్



ఎల్ఓసీ పత్రాలు అందుకున్న వారితో ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: మోకాలి శస్త్రచికిత్స కోసం చేయూత ఇప్పించాలని కోరగా ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి నలుగురికి రూ.6లక్షలు మంజూరు చేయించారు. ఎంపీ సిఫారసుతో కారేపల్లి మండలం కొత్త కమలాపురానికి కొల్లి నాగమ్మ, జాలా ధనమ్మ, మొండేపూడి కృష్ణారావు, మండేపూడి సత్యమ్మకు నిమ్స్‌లో శస్త్రచికిత్సకోసం రూ.1.50లక్షల చొప్పున సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరయ్యాయి. వీరికి ఎల్ఓసీ(లెటర్ఆఫ్ క్రెడిట్) పత్రాలను ఎంపీ హైదరాబాద్‌లో మంగళవారం అందజేయగా ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

సీజనల్ వ్యాధుల కట్టడిపై దృష్టి



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

కారేపల్లి: వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున కట్టడిపై ఉద్యోగులు దృష్టి సారించాలని డీఎంహెచ్ఓ కళావతి బాయి సూచించారు. కారేపల్లి మండలం తవిసిబోడులో ఐటీడీఏ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన మొబైల్ హెల్త్ యూనిట్‌ను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో సమావేశమై పారిశుద్ధ్య పనుల నిర్వహణ, వైద్యశిబిరాల ఏర్పాటుపై సూచనలు చేశారు. ప్రజలు వ్యక్తిగతంగానే కాక పరిసరాల పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం సీతారాంపురంలోని ఉప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కారేపల్లి పీహెచ్‌సీని కూడా డీఎంహెచ్ఓ తనిఖీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సురేష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

యంత్రాలు సకాలంలో అందాయా?



యంత్రాలను పరిశీలిస్తున్న బీ.ఎస్.రావు

నేలకొండపల్లి: ఖరీఫ్, రబీ సీజన్లలో ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాటుచేసిన కేంద్రాల్లో కావాల్సిన యంత్ర పరికరాలు సకాలంలో అందాయా, లేదా అన్న అంశంపై రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రొఫెసర్ బీ.ఎస్.రావు ఆరా తీశారు. నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం వచ్చిన ఆయన ప్యాడీ క్లీనర్లు, తేమ శాతం నిర్ధారణ యంత్రాలతో పాటు ఎలక్ట్రానిక్ కాంటాలను పరిశీలించారు. ఆతర్వాత మార్కెట్ కార్యాలయంలో సొసైటీల సీఈఓలు, ఐకేపీ, మార్కెట్ ఉద్యోగులతో సమావేశమైన బీ.ఎస్.రావు మాట్లాడారు. ఈ సమావేశానికి రైతు ప్రతినిధులను కూడా ఆహ్వానించి కొనుగోలు కేంద్రాల్లో కల్పించిన సౌకర్యాలు, అందిన పరికరాలపై ఆరాతీయడంతో పాటుఇంకా ఏమైనా సౌకర్యాలు అవసరమా అని చర్చించారు. జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ.అలీం, నేలకొండపల్లి మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

వెండి, బంగారు ఆభరణాలు చోరీ

కామేపల్లి: మండలంలోని తాళ్లగూడెంలో ఇంటి తాళం పగులగొట్టిన దుండగులు వెండి, బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన తూరపాటి వెంకన్న సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. మధ్యాహ్నం సమయాన గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగలకొట్టి బీరువాలో దాచిన 40తులాల వెండి, ఆరు గ్రాముల బంగారపు ఆభరణాలను చోరీ చేశారు. సాయంత్రం ఇంటికి వచ్చాక చోరీ జరిగిందని గుర్తించిన వెంకన్న మంగళవారం కారేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	6,700	5,900
కందులు	6,202	6,202
ఏసీ మిర్చి	14,000	12,000
ఏసీ మిర్చి తాలు	8,000	6,000
మిర్చి	9,000	5,000
పత్తి	7,850	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.17,463

సత్తుపల్లికి గరిష్ట ఫలాలు

- సీతారామ'తో నియోజకవర్గంలో 81వేల ఎకరాలకు సాగునీరు
- ఆయకట్టును స్థిరీకరించిన జలవనరుల శాఖ
- కల్లూరు మండలానికి చేరిన గోదావరి జలాలు



సాగర్ కాల్వలపై హెడ్ రెగ్యులేటరీ

కల్లూరురూరల్: సీతారామ ప్రాజెక్టు ద్వారా సత్తుపల్లి నియోజకవర్గంలోని సాగు భూములకు పుష్కలంగా సాగునీరు అందనుంది. నియోజకవర్గంలోని కల్లూరు, సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, తల్లాడ మండలాల్లో 81,819 ఎకరాలకు సాగునీరు అందుతుందని చెబుతున్నారు. ఈమేరకు జల వనరుల శాఖ అధికారులు ఆయకట్టును స్థిరీకరించారు. తద్వారా కృష్ణా నది పరీవాహకంలో వర్షాభావ పరిస్థితులు ఎదురైనా, నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుంచి నీరు విడుదల కాకున్నా సీతారామ జలాలతో పంటల సాగుకు ఢోకా ఉండదని చెబుతున్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లాలోనే అత్యధికంగా సత్తుపల్లి నియోజకవర్గ భూములకు సాగునీరు అందనుందని అంచనా వేస్తున్నారు.

ఎక్కడెక్కడ.. ఎంతెంత?

అశ్వాపురం మండలం బీజీ.కొత్తూరులోని పంప్‌హౌస్ నుంచి ఇటీవల గోదావరి జలాలను విడుదల చేశారు. నీరు ములకలపల్లి మండలం మీదుగా ఏన్కూరు మండలానికి అక్కడి లింక్ కెనాల్ నుంచి ఎన్నెస్పీ కెనాల్‌లోకి చేరి సత్తుపల్లి నియోజకవర్గానికి వస్తోంది. ఈమేరకు 21వ బ్రాంచి కెనాల్ 55 కి.మీ. నుంచి 101.306 కి.మీ. వరకు అందే నీరు వేంసూరు, పెనుబల్లి మండలాల్లో 5,733 ఎకరాలకు అందుతుంది. అలాగే, విధంగా కల్లూరు, తల్లాడ మండలాల్లో సాగర్ ఆయకట్టులోని 19,159 ఎకరాలకు, మధిర బ్రాంచ్ కెనాల్ 0 కి.మీ. నుంచి 22.750 కి.మీ. వరకు కాల్వ ద్వారా 31,069 ఎకరాలకు, కల్లూరు, తల్లాడ మండలాల్లో చెరువులు, కంటల కింద 8,450 ఎకరాలకు సీతారామ సాగర్ ద్వారా గోదావరి జలాలు అందనున్నాయి.

ఎత్తిపోతల పథకాలకు అనుసంధానం

ప్రస్తుతం సాగర్ జలాలపై ఆధారపడి పలు ఎత్తిపోతల నిర్వహణ కొనసాగుతోంది. ఇప్పుడు ఈ పథకాలను సీతారామ సాగర్ ప్రాజెక్టుకు అనుసంధానం చేయనున్నారు. ఈ విషయమై జలవనరుల శాఖ అధికారులు నిర్ణయం తీసుకోగా, కల్లూరు మండలంలోని కప్పలబంధం, బత్తులపల్లి ఎత్తిపోతల పథకం, ఖాన్‌ఖాన్‌పేట, నారాయణపురం ఎత్తిపోతల కింద సాగయ్యే 2,420 ఎకరాలకు గోదావరి జలాలు అందుతాయి. అలాగే, వేంసూరు మండలంలోని వేంసూరు -1, 2 లిఫ్టుల కింద 2,300 ఎకరాలు, పెనుబల్లి మండలంలోని రాథోని లిఫ్ట్ ఇరిగేషన్ పథకం, టేకులపల్లి, తాళ్లపెంట, బయ్యన్నగూడెం ఎత్తిపోతల పథకాల కింద 5,438 ఎకరాలకు నీరు అందించనున్నారు. ఆపై లంకాసాగర్ ప్రాజెక్టు పరిధిలోని 7,250 ఎకరాలకు సైతం సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు అందుతాయి. సీతారామ ప్రాజెక్టుతో సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు, సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, తల్లాడ మండలాలకు గరిష్ట స్థాయిలో ప్రయోజనం ఉంటుందని చెబుతున్నారు.

గోదావరి జలాలకు హారతి



కప్పలబంధం రెగ్యులేటరీ వద్ద పూజలు చేస్తున్న నాయకులు

కల్లూరు/కల్లూరురూరల్: వర్షాభావ పరిస్థితులు, సాగర్ జలాల విడుదలలో జాప్యంతో పంటలు ఎండిపోతున్న నేపథ్యాన సీతారామ ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన గోదావరి జలాలు మంగళవారం కల్లూరు మండలానికి చేరాయి. ఏన్కూరు మండలంలోని లింక్ కెనాల్ నుంచి సాగర్ కాల్వల్లోకి విడుదల చేసిన నీటిలో 500 క్యూసెక్కుల మేర కల్లూరు మండలంలోని కప్పలబంధం 73వ కి.మీ. రెగ్యులేటరీ వద్దకు చేరుకున్నాయి. ఆపై మధిర బ్రాంచ్ కెనాల్‌తో పాటు పుణ్యపురం మేజర్, మైనర్ కాల్వలకు విడుదల చేశారు. ఈనేపథ్యాన కప్పలబంధం రెగ్యులేటరీ వద్ద కాంగ్రెస్ నాయకులు, రైతులు పూజలు చేశారు. గోదావరి జలాలు విడుదల చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయికు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పసుమర్తి చందర్‌రావు, బంకా బాబు, ఎస్.కే.యాకూబ్ అలీ, దామాల రాజు, యాసా శ్రీకాంత్, పాపబత్తిని నగేష్, కళ్యాణపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వరంగల్ పాలు.. ఖమ్మంలో అమ్మకం

- తక్కువ ధరతో 'విజయ' పాల విక్రయంపై అనుమానాలు
- విచారణ మొదలుపెట్టిన ప్రత్యేకాధికారి



పాల ప్యాకెట్లను పరిశీలిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

ఖమ్మంవ్యవసాయం: ప్రభుత్వ పాడి పరిశ్రమ 'విజయ' పాల విక్రయాల్లో అక్రమాలు జరుగుతున్నాయా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పాత జిల్లాల వారీగా యూనిట్లు ఉండగా ఎక్కడికక్కడ డిస్ట్రిబ్యూటర్లను నియమించి పాలు సరఫరా చేసి విక్రయాలు చేపడుతున్నారు. అయితే, ఉమ్మడి ఖమ్మం జిల్లా అంతటా ఖమ్మం డెయిరీ ద్వారా సరఫరా చేసే పాలనే విక్రయించాల్సి ఉండగా వరంగల్‌లో ప్యాకింగ్ అయిన పాలు అమ్ముతున్నట్లు వెలుగు చూడడం చర్చనీయాంశంగా మారింది.

తక్కువ ధరకే అమ్ముతూ...

లీటర్ విజయ పాల ధరను ప్యాకెట్‌పై రూ.74గా ముద్రిస్తారు. డిస్ట్రిబ్యూటర్లకు రూ.7 కమీషన్ పద్ధతిపై రూ.67కు సరఫరా చేస్తారు. ఆపై డిస్ట్రిబ్యూటర్లు రిటైల్ వ్యాపారులకు రూ.70 నుంచి రూ.72 వరకు అందిస్తే వారు ఎమ్మార్పీతో అమ్ముతారు. రాష్ట్రమంతటా ఇలాగే జరుగుతున్నా కొద్దిరోజులుగా ఖమ్మంతో పాటు, జిల్లాలోని పలు ప్రాంతాల్లో రిటైల్ వ్యాపారులకు స్థానిక డిస్ట్రిబ్యూటర్‌తో సంబంధం లేకుండా పాలు సరఫరా అవుతున్నాయి. అంతేకాకుండా రూ.74 ఎమ్మార్పీ ముద్రించి ఉన్న ప్యాకెట్లను రిటైల్ వ్యాపారులకు రూ.62కే ఇస్తుండడం, ఇది ఖమ్మం డిస్ట్రిబ్యూటర్ ఇచ్చే ధర కంటే రూ.10 తక్కువగా ఉండడంతో అటే మొగ్గు చూపుతున్నారు. వరంగల్ డెయిరీ నుంచి మహబూబాబాద్ డిస్ట్రిబ్యూటర్‌కు సరఫరా అయ్యే పాలను వాహనంలో ఖమ్మం తీసుకొచ్చి విక్రయిస్తున్న విషయాన్ని ఖమ్మం డిస్ట్రిబ్యూటర్ నరేష్ ఇటీవల గుర్తించి డెయిరీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. అంతేకాక మంగళవారం కాపు కాసి మహబూబాబాద్ నుంచి వచ్చిన పాల వాహనాన్ని పట్టుకుని ఖమ్మం డెయిరీ యూనిట్‌లో అప్పగించారు. ఆపై ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వగా డిప్యూటీ డైరెక్టర్ ధన్‌రాజ్ చేరుకుని విచారణ చేపట్టారు.

అసలా.. నకిలీవా?

వరంగల్ విజయ డెయిరీ పేరిట ఖమ్మం తీసుకొస్తున్న పాలను తక్కువ ధరకు విక్రయిస్తుడడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్యాకెట్లపై విజయ లోగో ఉన్నప్పటికీ డెయిరీ నుంచి డిస్ట్రిబ్యూటర్లకు లీటర్ పాలను రూ.67కు ఇస్తుండగా మహబూబాబాద్ వ్యాపారి రూ.62కే ఇస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ఇన్ వాయిస్‌లు విక్రయిస్తుండడం, ప్యాకెట్లపై కోడ్‌లో తేడాను గుర్తించిన అధికారులు పాలు అసలువా, నకిలీవా అన్న అంశాన్ని నిర్ధారించేందుకు శాంపిళ్లను హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించినట్లు విచారణ అధికారి ధన్‌రాజ్ తెలిపారు. ఈ విచారణలో ఖమ్మం డీడీ కోడిరెక్క రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు ప్రాధాన్యత

ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి



కామేపల్లి : ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రానికి భూమి పూజ చేస్తున్న ఎస్ఈ శ్రీనివాసాచారి

ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయ విద్యుత్ సర్వీసుల జారీకి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఖమ్మం ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది సర్వీసుల మంజూరీ 14 శాతం పెరిగిందని వెల్లడించారు. 2023 జూలై 15నుంచి 2025 జూలై 14 వరకు 3,875 వ్యవసాయ సర్వీసులు మంజూరీ చేయగా, 2024 జూలై 15 నుంచి 2025 జూలై 14 వరకు 4,018 సర్వీసులు మంజూరు చేశామని తెలిపారు. అలాగే, పొలం బాటలో భాగంగా వంగిన స్తంభాలు, లూజ్ లైన్లను గుర్తించి సరిచేస్తున్నామని, ఇందులో భాగంగా1,937 లైన్లను సరిచేయడమేకాక అవసరమైన చోట 2,013 స్తంభాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అంతేకాకుండా వ్యవసాయ పంపుసెట్లకు కెపాసిటర్ల అవసరాలకు రైతులకు వివరిస్తున్నామని, అధిక లోడ్ ఉన్న చోట 360 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. మరమ్మతుకు గురైన ట్రాన్స్‌ఫార్మర్ల తరలింపునకు వాహనాలను ఏర్పాటు చేశామని, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే పట్టణాల్లో 24 గంటలు, గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటల్లోగా కొత్తవి అమరుస్తున్నామని ఎస్ఈ వెల్లడించారు.

కొత్తలింగాలలో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రం

కామేపల్లి/కారేపల్లి: కామేపల్లి మండలం కొత్తలింగాల సబ్ స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కేంద్రాన్ని ఎస్ఈ శ్రీనివాసాచారి భూమి పూజ చేశారు. ఈ కేంద్రం ద్వారా కామేపల్లి, కారేపల్లి, రఘునాథపాలెం, ఏన్కూరు మండలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే సత్వర మరమ్మతుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఆతర్వాత కారేపల్లి మండలం చీమలపాడు సబ్‌స్టేషన్‌లో లోఓల్టేజీ నివారణకు అమర్చిన 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎస్ఈ శ్రీనివాసాచారి చార్జ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో డీఈలు భద్రుపవార్, రామారావు, ఉద్యోగులు రాందాస్, ఆనంద్‌కుమార్, రామకృష్ణ, రాజేష్, వెంకటేశ్వర్లు, వై.వీ.ఆనంద్‌కుమార్, ఇందిర, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' ఉద్యోగులకు వేతనాలు కరువు



నేలకొండపల్లిలో మస్టర్‌ను తనిఖీ చేస్తున్న టీఏ (ఫైల్)

నేలకొండపల్లి: ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వర్తిస్తున్న సాంకేతిక సహాయకులు(టీ.ఏ), క్షేత్ర సహాయకుల(ఎఫ్.ఏ)కే కాక ఏపీఓలు, ఇతర సిబ్బందికి వేతనాలు అందక అవస్థ పడుతున్నారు. టీఏలకు సర్వీస్ ఆధారంగా రూ.20 వేల నుంచి రూ.45 వేల వరకు, క్షేత్ర సహాయకులకు రూ.12,140 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోంది. జిల్లాలో ఏపీఓలు 18మంది, ఈసీలు 16మంది, టెక్నికల్ అసిస్టెంట్లు 94మంది, క్షేత్ర సహాయకులు 348మంది, కంప్యూటర్ ఆపరేటర్లు 44మందితో పాటు ఇతర సిబ్బంది 20మంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి నెలల తరబడి వేతనాలు రాకపోవడంతో అర్థాకలితో విధులు నిర్వర్తించాల్సి వస్తోందని వాపోతున్నారు. విధుల విషయానికి వస్తే గ్రామసభల్లో గుర్తించిన, రైతులు దరఖాస్తు చేసుకున్న పనులను సాంకేతిక సహాయకులు ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తారు. ఆపై కొలతల ప్రకారం పనులను పంచాయతీ కార్యదర్శి, ఇతర సిబ్బంది, సీనియర్ మేట్లకు అప్పగించాలి. అంతేకాక కొలతల ప్రకారం పనులు జరుగుతున్నాయా, లేదా అని ప్రతీ వారం తనిఖీ చేసి రికార్డులను జూనియర్ ఇంజనీర్‌కు సమర్పించాలి. ఇక క్షేత్ర సహాయకులు గ్రామాల్లో పనులను కూలీలతో చేయిస్తూ కొలతలు వేయాల్సి ఉంటుంది. అయితే, జిల్లాలో కంప్యూటర్ ఆపరేటర్ల, టెక్నికల్ అసిస్టెంట్ల నాలుగు నెలలుగా, మిగతా వారికి మూడు నెలలుగా వేతనాలు రాక ఇబ్బంది పడుతున్నందున ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నారు.

ఈ టేబుల్‌కు ఎంతో ప్రాముఖ్యత!



కలెక్టర్ అనుదీప్ మంగళవారం కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలను తనిఖీ చేశారు. ఈక్రమాన మొదటి అంతస్తు రెవెన్యూ విభాగంలో పరిశీలిస్తుండగా గ్రానైట్ టాప్‌తో ఉన్న పాత టేబుల్‌ను గమనించారు. టేబుల్‌ను పక్కన ఎందుకు పెట్టారని ఆరా తీయగా... పాత కలెక్టరేట్‌లో విధులు నిర్వర్తించిన కలెక్టర్లందరూ ఈ టేబుల్‌నే ఉపయోగించారని కలెక్టరేట్ ఏఓ కె.శ్రీనివాసరావు బదులిచ్చారు. కొత్త కలెక్టరేట్‌కు మారాక చిన్నచిన్న మరకలు ఉండడంతో పక్కన పెట్టామని తెలిపారు. దీంతో కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ ఎంతో ప్రాముఖ్యత ఉన్న ఈ టేబుల్‌ను భద్రంగా చూసుకోవాలని సూచించారు.

– ఖమ్మం సహకారనగర్

బీఎల్ఓలకు సాంకేతిక శిక్షణ

- స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు సిద్ధం
- ఓటరు జాబితా ప్రక్షాళనకు వచ్చేనెల నుంచి ప్రత్యేక కార్యక్రమం



నేలకొండపల్లిలో బీఎల్ఓల శిక్షణలో మాట్లాడుతున్న పాలేరు ఎన్నికల అధికారి రాజేశ్వరి (ఫైల్)

నేలకొండపల్లి: స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో జరగనున్నాయనే ప్రచారం జరుగుతుండగా.. ఎప్పుడు నోటిఫికేషన్ వచ్చినా సిద్ధంగా ఉండేలా అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈమేరకు బీఎల్ఓ(బూత్ లెవల్ ఆఫీసర్)లకు ఓటర్ల జాబితా తయారీతో పాటు మార్పులు, చేర్పులు, సవరణపై శిక్షణ ఇస్తున్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై శిక్షణ ఇచ్చేందుకు నియోజకవర్గానికి ఆరుగురు మాస్టర్ ట్రెయినర్లను నియమించారు.

అవగాహన

ఎన్నికల సంఘం ద్వారా బీఎల్ఓ యాప్, ఓటర్లు హెల్ప్‌లైన్ యాప్‌ల్లో ఇటీవల మార్పులు చేశారు. ఈ మార్పులపై బీఎల్ఓలకు మాస్టర్ ట్రెయినీలు అవగాహన కల్పిస్తున్నారు. ఓటరు నమోదు, సవరణ దరఖాస్తులను నేరుగా యాప్‌లో అప్‌లోడ్ చేయడం, ఆపై పరిష్కరించే విధానాన్ని వివరిస్తున్నారు. అంతేకాక శిక్షణ ముగియగానే పరీక్ష నిర్వహించి బీఎల్ఓల అవగాహనను పరీక్షించనున్నారు. కాగా, కొత్త ఓటర్ల నమోదుతో పాటు తొలగింపు, సవరణల కోసం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా బిహార్ రాష్ట్రంలో చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఆగస్టు నుంచి దేశమంతా నిర్వహించనుండడంతో బీఎల్ఓలు సాంకేతిక అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. కార్డులో గతంలో ఉన్న ఫొటోతో పాటు చిరునామా మార్పు తదితర అంశాలను ఆన్‌లైన్‌లో చేసేల అవగాహన కల్పిస్తున్నారు. ఈ విషయమై రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన మాస్టర్ ట్రెయినర్ల ద్వారా ఈనెల 17వ తేదీ నాటికి బీఎల్ఓలకు శిక్షణ పూర్తిచేయాలనే లక్ష్యంతో అధికారులు ఉన్నారు.

ఎన్నికల సంఘం ఆదేశాలతో..



ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు షెడ్యూల్ ప్రకారం మండలాల వారీగా బీఎల్ఓలకు శిక్షణ ఇస్తున్నాం. యాప్‌ల్లో చేసిన మార్పులు, ఓటర్ల జాబితా సవరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం. సాంకేతికపరమైన సందేహాలన్నీ చేస్తున్నాం.

– పెద్ది జగన్నాథం, మాస్టర్ ట్రెయినర్, ఖమ్మం

ఇందిరా డెయిరీ వాటాధనం పక్కదారి

మండల సమాఖ్యలో జమ చేయని వీఓఏలు



వాటాధనం చెల్లించామని చెబుతున్న మహిళలు

బోనకల్: మధిర నియోజకవర్గంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేయనున్న ఇందిరా డెయిరీలో మహిళా సంఘాల సభ్యులకు సభ్యత్వం ఇస్తుండగా, కొందరి వాటాధనం పక్కదారి పట్టినట్లు తేలింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఇందిరా డైయిరీలో సభ్యులుగా చేరేందుకు మహిళలు రూ.2,100 చెల్లించాల్సి ఉంటుంది. వాటాధనాన్ని గ్రామంలోని వీఓఏలు వసూలు చేసి మండల సమాఖ్యకు చెల్లించాలి. అయితే, మండలంలోని రాపల్లి వీఓఏలు సభ్యుల నుంచి రూ. 2,100 చొప్పున వసూలు చేసినా మండల సమాఖ్యకు చెల్లించలేదని బయటపడింది. ఆన్‌లైన్‌లో పరిశీలించగా ఈ విషయాన్ని గుర్తించిన సభ్యులు సీసీ శ్రీనివాసరావును అడిగితే ధాటవేత ధోరణిలో సమాధానం చెప్పినట్లు తెలిసింది. దీంతో డబ్బులు చెల్లించిన సభ్యులు ఇటీవల ఐకేపీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఈ అంశంపై ఏపీఎం సురేంద్రబాబును వివరణ కోరగా డబ్బు చెల్లించిన సభ్యులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. రోజులు గడుస్తున్నా స్పష్టత లేకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని వారు కోరుతున్నారు.

'ప్రభుత్వాల విధానాలతో కార్మికుల శ్రమ దోపిడీ'



సమావేశంలో మాట్లాడుతున్న పద్మ

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను విస్మరించడమే కాక పాలకులు ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాలతో కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారని టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎల్.పద్మ పేర్కొన్నారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన టీయూసీఐ జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కార్మికుల పరిస్థితి దిగజారేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. గత ప్రభుత్వం వేతనాలు పెంచకపోగా, ప్రస్తుత ప్రభుత్వం పని గంటలు పెంచి కార్మికులపై భారం పెంచిందన్నారు. ఈమేరకు కనీస వేతనాలు ఇవ్వడంతో పాటు పెంచిన పని గంటలను తగ్గించాలనే డిమాండ్‌తో ఈనెల 31న కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ సమావేశంలో టీయూసీఐ జిల్లా కార్యదర్శి జి.రామయ్య, అధ్యక్షుడు ఎ.వెంకన్న, నాయకులు కొయ్యల శ్రీనివాస్, సీ.వై.పుల్లయ్య, వెలదండి బాబు, ఆవుల అశోక్, శరత్, ఎస్.కే.లాల్‌మియా, గోసు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్య



దుర్గాభవాని (ఫైల్)

సత్తుపల్లిటౌన్: కడుపునొప్పి తాళలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. సత్తుపల్లి మండలం సిద్ధారానికి చెందిన గోళ్లపూడి గోపి, కాకర్లపల్లికి చెందిన దుర్గాభవాని(30) 2018లో ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే, గర్భసంచి సమస్యతో బాధపడుతున్న ఆమె సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఉన్న మాత్రలను అధిక మోతాదులో మింగింది. దీంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందింది. దుర్గాభవాని దంపతులకు ఇద్దరు పిల్లలు ఉండగా, కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తికి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. నేలకొండపల్లి మండలం అజయ్‌తండాకు చెందిన గుగులోతు సైదులు(37) మంగళవారం ఖమ్మం రాగా, జిల్లా ఆస్పత్రి ఎదుట రోడ్డు దాటే క్రమాన వేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు.

పల్టీ కొట్టిన కారు: తప్పిన ప్రమాదం



డివైడర్‌ను ఢీకొని బోల్తా పడిన కారు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం గొల్లగూడెం రోడ్డులో రెండు కార్లు ఢీకొనగా, ఓ కారు డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఖమ్మంకు చెందిన సుధాకర్ మంగళవారం తన కుటుంబ సభ్యులతో కారులో వెళ్తుండగా వెనక నుండి మరో కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో సుధాకర్ కారు బోల్తా పడగా అందులో ఉన్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆ సమయాన వాహనాల రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది. ఈ ఘటనలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడగా ఖమ్మం అర్బన్ పోలీసులు చేరుకుని రాకపోకలను క్రమబద్ధీకరించారు.

30 ట్రక్కుల ఇసుక డంప్ సీజ్

తిరుమలాయపాలెం: మండలంలోని ముజాహిదిపురం శివార్లలో నిల్వ చేసిన 30 ట్రక్కుల ఇసుకను మంగళవారం పోలీసులు, రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం ధరావత్‌తండాకు చెందిన ధరావత్ రమేష్, ధరావత్ రవీందర్ అనుమతి లేకుండా ఇసుక నిల్వ చేసినట్లు గుర్తించి సీజ్ చేశామని పోలీసులు ఈ సందర్భంగా తెలిపారు.